ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల
జిల్లా వార్తలు
శుక్రవారం 24 మే 2024



ఏపీఈఆర్సీ నూతన భవనం ప్రారంభం

కర్నూలు, మే 23: నగరంలోని దిన్నెదేవరపాడు కార్బైడ్‌ఫ్యాక్టరీ సమీపంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఏపీఈఆర్సీ నూతన భవనానికి గురువారం పూజ నిర్వహించారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి శాశ్వత భవనంలో ప్రత్యేకపూజలు చేపట్టారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌లోని ఏపీఈఆర్సీ కార్యాలయాన్ని కర్నూలు జిల్లాకు తరలించారు. ఈ క్రమంలో రూ.23 కోట్లతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సభ్యుడు రామ్‌సింగ్, ఫైనాన్స్ సభ్యుడు టీఆర్‌కే.రెడ్డి పాల్గొన్నారు.



క్రాస్ ఓటింగ్ భయం..!

- వైసీపీ ఓట్లకు కాంగ్రెస్ గండి..!
- జిల్లాలో భారీగా క్రాస్ ఓటింగ్
- అధికార పార్టీ నేతల్లో టెన్షన్
- తమకు లాభిస్తుందంటున్న టీడీపీ
- హస్తం గుర్తు వైపు వెళ్లిన తటస్థులు
- పలుమార్లు జిల్లాలో పర్యటించిన వైఎస్ షర్మిల
- ఫలించిన జగన్‌పై విమర్శనాస్త్రాలు



నంద్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగి పది రోజులు పూర్తయింది. మరో పది రోజుల్లో ఫలితాలు రానున్నాయి. ఎన్నికల ముందు వరకు గెలుపు కోసం అధికార పార్టీ చేయని పని లేదు. ఇక పోలింగ్ పూర్తయిన తర్వాత గెలుపు తమదేనన్న ధీమాతో కూడా వైసీపీ నాయకులు ఉన్నారు. అయితే నంద్యాల జిల్లాలో వైసీపీ ఓట్లకు కాంగ్రెస్ పార్టీ గండి కొట్టిందన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది. క్రాస్ ఓటింగ్ జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటంతో అధికార పార్టీ నేతల్లో గుబులు కలిగిస్తోంది. నంద్యాల ఎంపీ స్థానానికి టీడీపీ తరపున డాక్టర్ బైరెడ్డి శబరి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెస్ నుంచి జె.లక్ష్మినరసింహయాదవ్ బరిలో నిలిచారు. ప్రధాన పోటీ వీరి మధ్యే ఉండనుంది. ఇక కాంగ్రెస్‌కు పడిన ఓట్లతో ఏ నియోజకవర్గంలో ఏ నేత పుట్టి మునుగుతుందోనని వైసీపీ ఆందోళన చెందుతుంటే.. వైసీపీ ఓట్లను కాంగ్రెస్ చీల్చడం తమకు లాభిస్తుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఎంపీకి పడాల్సిన ఓటింగ్‌లో అధికశాతం క్రాస్ ఓటింగ్ జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నంద్యాల జిల్లాలో వైఎస్ షర్మిల బహిరంగ సభలు నిర్వహించడం, సొంత అన్న, సీఎం జగన్‌పై చేసిన విమర్శలతో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. ఈ తరుణంలో ఎంపీ ఓటింగ్‌లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద అసలు క్రాస్ ఓటింగ్ ఏ స్థాయిలో జరిగిందనేది మరో పది రోజుల్లో తేలనుంది.

ఏ మేరకు ప్రభావం..

2014 రాష్ట్ర విభజనకు ముందు వరకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉండేది. పేద, బడుగు, బలహీన వర్గాల ఓట్లే ఆ పార్టీకి బలం. అయితే రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైసీపీ తెరమీదకు రావడం, ఆ తర్వాత పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లంతా వైసీపీకి మారిపోయారు. ప్రస్తుతం వైసీపీకి ఉండే ఓట్ల శాతం మొత్తం కాంగ్రెస్ నుంచి బదిలీ అయినవే ఎక్కువ. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సరైన అభ్యర్థులు కూడా దొరకలేదు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన వారిలో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి తొగూరు ఆర్థర్ సిట్టింగ్ ఎమ్మెల్యే కావడం, ప్రజల్లో పేరున్న నాయకుడు ఎదిగారు. అదేవిధంగా నంద్యాల ఎంపీ స్థానానికి పోటీ చేసిన జె.నరసింహ యాదవ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ తనదైన గుర్తింపు కలిగి ఉన్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపు నాయకుడిని బట్టి కాకుండా, ఓ వర్గం పట్టుదలగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని నిశ్చయించుకోవడంతోనే క్రాస్ ఓటింగ్ జరిగిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన వారితో పాటు ముస్లిం మైనార్టీ ప్రభావం ఉన్న నాయకులు ఎంపీకి క్రాస్ ఓటింగ్ వేసి ఉంటారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇది ఏ స్థాయిలో జరిగిందో జూన్ 4వ తేదీన వెల్లడయ్యే ఫలితాల్లో తేలనుంది.

ఎంపీ ఓట్లే ఎక్కువగా చీలాయా..?


బైరెడ్డి శబరి


లక్ష్మినరసింహ యాదవ్


పోచా బ్రహ్మానందరెడ్డి

క్రాస్ ఓటింగ్‌కు సంబంధించి ఎంపీ ఓటింగ్‌లోనే ఎక్కువగా జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఓ వర్గానికి సంబంధించిన ఓటర్లు మెజార్టీ శాతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ఓట్లు భారీగా చీలాయన్న భావన వ్యక్తమవుతోంది. ఈ వర్గానికి సంబంధించిన ఓటర్లు జిల్లా వ్యాప్తంగా దాదాపు 3.5 లక్షల మంది ఉన్నారు. వీరంతా రాష్ట్రంలో కూటమికి మద్దతుగానే తమ ఓట్లను వేసినా ఎంపీ దగ్గరకు వచ్చే సరికి మాత్రం తమ ఓటును కాంగ్రెస్‌కు బదలాయించినట్లు తెలుస్తోంది. దీనికి కారణం లేకపోలేదు.. కేంద్రస్థాయిలో బీజేపీతో పోల్చుకుంటే కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా ఉంటుందన్న అభిప్రాయం ఈ వర్గం వారిలో బలంగా ఉంది. పైగా దేశవ్యాప్త చట్టాలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది కాబట్టి తమ ఓటు కాంగ్రెస్‌కు వేయాలని ముందుగానే నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తన వ్యాపార వ్యవహారాలు చూసుకోవడం తప్ప తమకు చేసిందేమీ లేదన్న కోపం కూడా ఉంది. దీంతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఈ వర్గం వారి ఓట్లను బాగానే దక్కించుకున్నట్లు ఎగ్జిట్ పోల్స్ పలు రాజకీయ నిపుణులు వెల్లడించడం గమనార్హం. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన పోచా బ్రహ్మానందరెడ్డి 2.40 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రాస్ ఓటింగ్ గనుక భారీగా జరిగితే మాత్రం వైసీపీ ఓటింగ్ శాతం దారుణంగా పడిపోయే పరిస్థితి ఉంటుంది. ఇదే క్రమంలో క్రాస్ ఓటింగ్ తమకు కలిసి వస్తుందంటూ టీడీపీ లెక్కలు వేసుకుంటోంది.

ఆర్థర్ ప్రభావం ఎంతమేర?

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎంపీ ఓట్ల తర్వాత ఎమ్మెల్యే ఓట్లకు సంబంధించి ఎక్కువగా ఓట్లు క్రాస్ అయ్యే అవకాశం ఉన్నది నందికొట్కూరు నియోజకవర్గంలోనే. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌కు అధికార పార్టీ మొండి చేయి చూపటం, ఆ తర్వాత పరిణామాల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరి టికెట్ దక్కించుకున్నారు. దీంతో నందికొట్కూరులో త్రిముఖ పోటీ ఏర్పడింది. వైసీపీ తరపున నిలబడిన ఎమ్మెల్యే అభ్యర్థి ధారా సుధీర్ స్థానికుడు కాకపోవడంతో పాటు, ఆర్థర్ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా నియోజకవర్గంలో ఎక్కువగానే ఉన్నారు. దీనికి తోడు వైసీపీ ఐదేళ్ల పాలనతో ఎమ్మెల్యే ఆర్థర్‌ను సొంత పార్టీ నేతలే ఇబ్బందులకు గురి చేశారన్న ఆవేదన ఎస్సీ సామాజికవర్గం ఓటర్లలో పాతుకుపోయింది. దీంతో నందికొట్కూరు నియోజకవర్గంలో ఆర్థర్ బాగానే ఓట్లు రాబట్టాడన్న ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే వైసీపీకి ఓట్ల గండి భారీగా పడే అవకాశం ఉంది.

క్రాస్ ఓటింగ్ లాభిస్తుందా..?

ఓ వర్గం పెద్దలు క్రాస్ ఓటింగ్‌లో భాగంగా ఒక ఓటును కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి వేసి, మిగిలిన ఓటును ఇష్టం వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థికి వేయాలని నిశ్చయించుకున్నారు. తమ సామాజిక వర్గం వారికి కూడా ఇదే విధంగా సూచించారు. అయితే పోలింగ్ రోజు మాత్రం ఆ వర్గం ఓటర్లు కాస్త గందరగోళానికి గురైనట్లు తెలుస్తోంది. మొదట ఈవీఎంలో ఉండే గుర్తు రెండో ఈవీఎంలో మరో చోట ఉండే అవకాశం ఉంటుంది. వెతికి మరీ ఓటు వేసే అవగాహన అందరికీ ఉండదు. దీంతో ఎంపీ ఓటు ఏ గుర్తుకు వేశారో? ఎమ్మెల్యే ఓటు కూడా ఆ గుర్తుకే వేసే అవకాశం ఉంది. దీంతో క్రాస్ ఓటింగ్ కొన్నిసార్లు అనుకున్న ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. గతంలో ఇలా క్రాస్ ఓటింగ్‌తో గెలుస్తామనుకున్న అభ్యర్థులు ఓడిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. పోలింగ్ రోజు నంద్యాల నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని తెలుసుకున్న ఓ పార్టీ నేత వెంటనే అప్రమత్తమై క్రాస్ ఓటింగ్ జరగకుండా జాగ్రత్తపడ్డాడు. మొత్తానికి క్రాస్ ఓటింగ్ ఏ స్థాయిలో జరిగింది, ఇది ఏ మేరకు తమకు నష్టాన్ని చేకూరుస్తుందోనని వైసీపీ పార్టీ నేతలు టెన్షన్‌గా ఉన్నారు.



నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల (నూనెపల్లె), మే 23: జిల్లాలో శుక్రవారం నుంచి పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆయా పరీక్షల వివరాలను జిల్లా అధికారులు వేరువేరుగా వెల్లడించారు. పదవ తరగతి పరీక్షలకు 402 పాఠశాలల నుంచి మొత్తం 7,748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఈవో సుధాకరరెడ్డి తెలిపారు. వీరిలో బాలురు 4,587 మంది, బాలికలు 3,158 మంది ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలు జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్ష ఆకేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని డీఈవో సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు : జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు డీవీఈవో సునీత గురువారం తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 9,350 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు 4,398 మంది మొత్తం 13,748 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో 31పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

వాట్సాప్ మోసాలపై నిఘా..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆ నంబర్లపై పోలీసుల ఆరా

ఆత్మకూరు, మే 23: వాట్సాప్ వేదికగా ఆత్మకూరు/నందికొట్కూరు సమాచారం పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై ఆత్మకూరు పోలీసు ఉన్నతాధికారులు స్పందించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన "వాట్సాప్ గ్రూపుల్లో మరో మోసం" అనే కథనానికి ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు స్పందించినట్లు సమాచారం. ఇప్పటికే ఆత్మకూరు, నందికొట్కూరు సర్కిళ్ల పరిధిలోని అర్బన్, రూరల్ సీఐలకు ఆదేశాలు జారీ చేసి ఆత్మకూరు/నందికొట్కూరు వాట్సాప్ గ్రూప్ పేరుతో కీర్తి కీర్తి, రచన రచన అనే పేర్లతో చేస్తున్న మోసాలపై ఆరా తీయాలని సూచించినట్లు తెలిసింది. వాస్తవానికి సుమారు 550 మంది సభ్యులకు పైగా ఉన్న ఈగ్రూపులో రచన రచన అనే పేరుతో 9381295474, కీర్తి కీర్తి అనే పేరుతో 9390999349 నంబర్లు కలిసిన వ్యక్తులు మాత్రమే అడ్మిన్లుగా ఉన్నారు. వీరు ప్రతిరోజు గ్రూపులో రూ.1000 ఫోన్‌పే చేస్తే ఆఫర్ కింద రూ.10500 పది నిమిషాల్లో క్రెడిట్ చేస్తామని, అలాగే రూ.1500 ఫోన్‌పే చేస్తే రూ.18500 క్రెడిట్ చేస్తామని మెసేజ్‌లను పోస్టు చేస్తున్నారు. గురువారం కూడా రూ.2వేలు ఫోన్‌పే చేస్తే ఆఫర్ కింద రూ.19500 క్రెడిట్ చేస్తామని పోస్టు చేశారు. ఈ ఆఫర్లకు ఆశపడి కొంతమంది అమాయకులు నష్టపోతున్నారు. అయితే సదరు వాట్సాప్ నంబర్లకు కాల్ చేస్తే ఎవరూ స్పందించడం లేదు. కేవలం వాట్సాప్ మేసేజ్‌లకు మాత్రమే రిప్లై ఇస్తున్నారు. ఒకవేళ తమకు అన్యాయం జరిగిందని ప్రశ్నిస్తే ఆ నంబర్‌ను గ్రూప్ నుంచి రీమూవ్ చేస్తున్నారు. ఈ మోసాలపై ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు వెళ్లడంతో ఆయన సబ్‌డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, నందికొట్కూరు సర్కిళ్ల పోలీసు అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది.

పాలిసెట్ కౌన్సెలింగ్ ఏర్పాట్లు పూర్తి

నంద్యాల (నూనెపల్లె), మే 23: రాష్ట్ర సంకేతిక విద్యాశాఖ వెలువరిచిన షెడ్యూల్ ప్రకారంగా ఈ నెల 24వ తేదీ నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అవుతున్నట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసప్రసాద్ గురువారం తెలిపారు. దీనికి ప్రాసెసింగ్ ఫీజును ఈ నెల 24వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో చెల్లించ వచ్చని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ 700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 250 ఫీజు ఉంటుందన్నారు. తదుపరి వారి ర్యాంకుల ప్రకారం ఈ నెల 27వ తేది నుంచి జూన్ 3వ తేది వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. మే 31 వతేది నుంచి జూన్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్‌ల నమోదు, జూన్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ మార్పులకు అవకాశం ఉంటుందని చెప్పారు. జూన్ 7వ తేదిన సీట్ల కేటాయింపు పూర్తి చేస్తారని జూన్ 10వ తేదీ నుంచి పాలిటెక్నిక్ కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ధ్రు పత్రాల పరిశీలనకు అభ్యర్థి తనకు దగ్గరలోని సహాయ కేంద్రానికి కేటాయించిన రోజులలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరుకావాలని సూచించారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మే 23: సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన చాంబర్‌లో ఓట్లలెక్కింపు ప్రక్రియపై మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లోని ఈవీయంలకు మూడు అంచెల భద్రత కల్పించామన్నారు. కౌంటింగ్ కోసం అడిషనల్ ఏఆర్‌ఓలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. కౌంటింగ్ అధికారులకు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసి మూడు రోజుల్లో శిక్షణా తరగతులు కూడా నిర్వహిస్తామన్నారు.

గరుడవాహనంపై జ్వాలానృసింహుడు

ఆళ్లగడ్డ, మే 23: ఆళ్లగడ్డ మండలంలోని ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి గురువారం గరుడవాహనంపై విహరించారు. వైశాఖ మాస నరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు రోజూ ఓ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తున్నారు. జ్వాలా నరసింహస్వామికి వేకువ జామున ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై అలంకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.


అలంకరణలో జ్వాలానరసింహస్వామి

ఘనంగా చెన్నకేశవస్వామి రథోత్సవం


స్వామివార్లను పల్లకిపై తీసుకొస్తున్న దృశ్యం

భక్తజనసందోహం నడుమ చెన్నకేశవస్వామి రథోత్సవం

జనసంద్రంగా మారిన మిడుతూరు

మిడుతూరు, మే 23: మిడుతూరులో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం గురువారం ఉత్సాహంగా సాగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు రథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా ఆలయ ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను అర్చకులు ప్రత్యేక పుష్పాలతో అలంకరించి రథంపైకి తీసుకెళ్లారు. రథోత్సవం ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సాగింది. గోవిందనామస్మరణతో మిడుతూరు వీధులన్నీ మార్మోగాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు మిద్దెలపైకి ఎక్కారు. రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ప్యాలకుర్తి వద్ద బస్సు బోల్తా
- ఇద్దరు బాలికలు దుర్మరణం
- 15 మందికి తీవ్రగాయాలు
- హైదరాబాద్ నుంచి ఆదోనికి వస్తుండగా ఘటన



ఘటనా స్థలంలో మృత దేహాలు

కోడుమూరు (రూరల్), మే 23: హైదరాబాద్ నుంచి ఆదోనికి వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కోడుమూరు మండలం ప్యాలకుర్తి వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు బాలికలు సంఘటనా స్థలంలో దుర్మరణం పాలయ్యారు. 15 మందికి తీవ్ర గాయాలు కాగా మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి బిస్మిల్లా ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుంచి ప్రయాణికులతో ఆదోనికి బయలుదేరింది. అయితే మార్గమధ్యంలో ప్యాలకుర్తి స్టేజీ దాటాక ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసిన బస్సు అదేవేగంతో రోడ్డుపక్కన ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడ్డారు. చాలామందికి తీవ్రగాయాలు కావడంతో హాహాకారాలు మిన్నంటాయి. ఘటనాస్థలి నుంచి డ్రైవర్ పారిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ బాలనరసింహులు సిబ్బందితో చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను బయటకు తీయించారు. తీవ్రంగా గాయపడిన వారిలో భారతి (అమీర్‌పేట్), గౌస్‌మోదీన్ (ముగతి), బదినేహాల్ మౌనిక (కోసిగి), ముదగళ్ల పుష్పావతి (కోసిగి), పినిశెట్టి లక్ష్మి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (అమలాపురం), సాయిగణేష్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (ఎమ్మిగనూరు), కొమ్ముపాలెం అశోక్‌కుమార్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఉద్యోగి (ఆదోని), అమడగుంట్ల అశోక్‌కుమార్ (కోడుమూరు), అక్కెం వెంకటరెడ్డి (బాపురం), రెహమాన్ (ఎమ్మిగనూరు), రాజు (ఆదోని) కృష్ణవేణి (హైదరాబాదు) ఉన్నారు. గాయపడ్డవారిని పోలీసులు, స్థానికులు 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిని ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించి ప్రమాదతీరును తెలుసుకున్నారు. ఎస్ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.



ప్యాలకుర్తి వద్ద బోల్తాపడ్డ బస్సు



సెలవుపై వచ్చి పరలోకానికి...

బస్సు ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల మృతి అందరిని కలచివేసింది. మైదుకూరుకు చెందిన సురేంద్ర, కవిత దంపతుల కూతురు గోవర్ధని, వెంకటేష్, సావిత్రి దంపతుల కుమార్తె లక్ష్మి వేసవి సెలవులను గడపడానికి హైదరాబాదులోని బాలానగర్‌లో ఉంటున్న దగ్గరి బంధువు కృష్ణవేణి ఇంటికి వెళ్లారు. అయితే ఆమె శుక్రవారం ఆదోనిలో ఒకేషనల్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. దీంతో తన కుమారుడు మనోహర్, అన్న కొడుకు, కూతురు జ్ఞానేంద్ర, గోవర్ధని (7), చిన్నాన్న కూతురు లక్ష్మి (13), మేనమామ కూతురు లీలావతిలతో బిస్మిల్లా ట్రావెల్స్‌లో ఆదోనికి బయలుదేరింది. ప్రమాదంలో గోవర్ధని, లక్ష్మి తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందగా వెంటవచ్చిన కృష్ణవేణికి తీవ్ర గాయాలయ్యాయి. కొడుకు మనోహర్, జ్ఞానేంద్ర, లీలావతిలకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో చిన్నారుల బంధువుల రోదనలు మిన్నంటాయి. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



గోవర్ధని (ఫైల్)



లక్ష్మి (ఫైల్)



ఘటనా స్థలంలో ఎస్పీ పరిశీలన

జగన్ స్క్రిప్టుతోనే వైసీపీ దాడులు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు యాదవ్

కర్నూలు(అర్బన్), మే 23: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి డైరెక్షన్, స్క్రిప్టు ఆధారంగానే రాష్ట్రంలో వైసీపీ దాడులు చేస్తోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. 13న జరిగిన పోలింగ్‌లో అరాచకాలు సృష్టించి ఓటర్లలను భయ భ్రాంతులకు గురి చేసి, వారు ఓటింగ్‌కు రాకుండా దూరం ఉండేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఓటమి భయంతో పోలింగ్ కేంద్రంలో ఏకంగా ఈవీఎంలను మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి ధ్వంసం చేశారని, పైగా ఏజెంట్‌పై దాడి చేశారని అన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని కేసు నమోదు చేసిందని తెలిపారు. తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తిని శివకుమార్ ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారిపై దాడి చేశారని, గురుజాలలో కాసు మహేశ్వరరెడ్డి తన అనుచరులను వెంటబెట్టుకుని వెళ్లి ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేశారని అన్నారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఓడిపోతామనే భయంతోనే వైసీపీ బలగాలు జగన్‌రెడ్డి డైరెక్షన్‌లో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయని అన్నారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా ఎన్నికల కమిషన్ ప్రత్యేక బలగాలను మోహరించి ఎలాంటి దాడులు, అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- బెల్లం ఊట ధ్వంసం, ద్విచక్రవాహనం సీజ్, ఇద్దరు అరెస్టు
- సెబ్ సూపరింటెండెంట్

కర్నూలు(అర్బన్), మే 23: నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో కోడుమూరు సీఐ రామాజంనేయులు, కర్నూలు డీటీఎఫ్ స్కాడ్ ఎస్ఐ వీరస్వామి అధ్వర్యంలో వెల్దుర్తి మండలంలోని ఎల్ బండ తండాకు చెందిన వడిత్యస్వామి నాయక్, రామళ్ల కోట గ్రామానికి చెందిన మద్దిలేటి స్వామిని అదుపులోకి తీసుకొని ఆయా గ్రామాల్లో జరిపిన దాడుల్లో 25 లీటర్ల నాటుసారా, టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనం సీజ్ చేసి, 480 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ కేసుల్లో పట్టు బడిన ఇద్దరిని పత్తికొండ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది హనుమంతు, శంకర్, గోపాల్ నాయక్, వెంటరాయుడు, బషీర్ బాషా, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోన్(రూరల్), మే 23: డోన్ పట్టణం గుత్తి రోడ్డు సెంజో స్కూల్ ఎదుటి ప్రదేశంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. క్రిష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన భీమలింగం (40) మూడు రోజుల క్రితం ఇల్లు వదిలి డోన్‌కు వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతునికి అప్పులు ఉన్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గత మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి తండ్రిపై దాడి

పత్తికొండ, మే 23: కూతురు వెంటపడి ఇబ్బంది పెట్టవద్దని మందలించాడన్న కోపంతో యువతి తండ్రిపై ఓ యువకుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన పత్తికొండలో గురువారం చోటు చేసుకుంది. సీఐ మురళీమోహన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పత్తికొండ పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తెను పత్తికొండ పట్టణానికి చెందిన సుధాకర్ కొద్దిరోజులుగా లైంగికంగా వేధించడంతోపాటు ఫొటోలను వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఈ క్రమంలో ఆ యువతి నుంచి బెదిరించి డబ్బులు కూడా కాజేశాడు. అయినప్పటికి వేధింపులు ఆపకపోవడంతో బాధితురాలు విషయాన్ని తండ్రికి తెలిపింది. దీంతో తన కుమార్తె జోలికివస్తే బాగుండదని యువకుడు సుధాకర్‌ను మందలించాడు. దీంతో సుధాకర్ కుటుంబ సభ్యులైన తండ్రి చిన్ననరసప్ప, ఈశ్వరమ్మ, పెదనాన్న పెద్దనరసప్పలు సుబ్రహ్మణ్యంపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేటినుంచి పాలిసెట్ కోర్సులో ప్రవేశాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 23: పాలిసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. స్థానిక తాండ్రపాడులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం మే 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 ఫీజులు చెల్లించాలన్నారు. విద్యార్థుల ధృవపత్రాల పరిశీలన మే 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం మే 31వ తేదీ నుంచి జూన్5వ తేదీ వరకు ఆయా కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. జూన్ 5వ తేదీన ఆప్షన్లను మార్చుకునే అవకాశం ఉందన్నారు. 7వ తేదీన కళాశాలల్లో సీట్లు కేటాయింపు జరుగుతుందని ప్రిన్సిపాల్ వివరించారు.

విద్యుత్‌శాఖలో 29 పోస్టులు ఖాళీ

కల్లూరు, మే 23: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖలో 29 ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో మొత్తం 99 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు గాను కేవలం 74 మంది మాత్రమే ఉండగా 25 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక సమాచారం. కర్నూలు టౌన్, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్‌లకు ఈఈలు లేక ఏడీఈలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. కాగా ఆలూరు ఏడీఈ ఇటీవల సస్పెండయ్యారు. మండల స్థాయిలో ఏఈలు లేకపో వడంతో ప్రజలు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులకు ప్రజలు తమ సమస్యలు తెలియజేసినా పరిష్కరించేందుకు ఏఈలు లేక ఏడీఈలు అం దుబాటులో ఉండకపోవడంతో అవస్థలు పడుతున్నారు. విద్యుత్ వినియో గదారుల సమస్యలు పరిష్కారం కావడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జేఈలకు అనుభవం లేకపోవడంతో పనుల్లో జాప్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 25 మండలాల్లో ఏఈలు లేకపోవడంతో ఉన్నతాధికారులు అక్కడ జేఈలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. అయితే విద్యుత్ సమస్యలపై తమ వద్దకు వచ్చిన ప్రజలు వస్తే జేఈలు ఏడీఈకి చెప్పాలని, అనుమతి వస్తే చేస్తామని, సంతంకం కాలేదని చెప్పి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, కొత్తలైన్లు కావాలని జేఈలను సంప్రదిస్తే పనులు చేయడంలో తీవ్రజాప్యం జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. జేఈలకు అనుభవం లేకపోవడంతో సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. దీంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుండి ఉన్నతాధికారులు వచ్చినా అక్కడికి ఏడీఈలు హాజరవ్వాల్సిన పరిస్థితులున్నాయి.



పనివత్తిడి తట్టుకోలేక సెలవులో ముగ్గురు ఈఈలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనివత్తిడి తట్టుకోలేక ముగ్గురు ఇంజనీర్లు సెలవులో వెళ్లినట్లు సమాచారం. కర్నూలు టౌన్, ఎమ్మిగనూరు, ఆదోనికి చెందిన ముగ్గురు ఈఈలు ఆయా డివిజన్‌లలో విధుల్లో హాజరైన తరువాత పనివత్తిడి తట్టుకోలేక సెలవుల్లో వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో అయా డివిజన్లలో ఉన్నతాధికారులు ఏడీఈలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

నంద్యాల, మే 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్ హత్యాయత్నం కేసులో నిందితులైన చంద్రకుమార్, షేక్ మాలిక్‌బాషా, తప్పెట నరసింహ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు డిఎస్పీ షర్ఫుద్దీన్ గురువారం తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదిన మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి ముందు నిఖిల్‌పై హత్యాయత్నం ఘటనలో ముగ్గురిని అరెస్టు చేశామని అన్నారు. గత ఏడాది యువగళం పాదయాత్రలో ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసిన నిఖిల్‌ను చంపేందుకు తన అనుచరులతో ఏవీ కుట్ర పన్నినట్లు తెలిసిందని డిఎస్పీ వివరించారు. ఈ హత్యాయత్నం కేసులో ఈ నెల 17న ఇద్దరిని అరెస్టు చేశామని, మరో ముగ్గురిని ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలు వద్ద అరెస్టు చేశామని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఏవీ సుబ్బారెడ్డి, కర్నూలు ఆటో డ్రైవరు చంటి పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేష్‌బాబు, పట్టణ ఎస్ఐ నగీనా, పోలీసు సిబ్బంది ఉన్నారు.



నిందితులను చూపిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మే 23: రాయలసీమ యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లను ఈ నెల 26వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్వోలు, ఏఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, కౌంటింగ్ నోడల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లుతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో అన్ని ఏర్పాట్లను ఈ నెల 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాల్లోకి ఆర్వో, అబ్జర్వర్, ఒక ఏఆర్వో, కౌంటింగ్ స్పెషల్ ఆఫీసర్లకు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతి ఉంటుందని అన్నారు. నియోజకవర్గాల వారీగా ఏజెంట్ ఐడెంటిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్ తేజ, శివ్‌నారాయణ్‌శర్మ పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), మే 23: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై శుక్రవారం నగరంలోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో ఎన్నికల సిబ్బందికి అధికారులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. గురువారం జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో శిక్షణా తరగతులకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024 కౌంటింగ్‌కి సంబంధించి విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణా తరగతులులో కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తామన్నారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఏడుగురు డీబార్

కర్నూలు(అర్బన్), మే 23: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 61 పరీక్షా కేంద్రాల్లో రెండో సెమిస్టర్‌కు 2131కు 1932 మంది, ఆరో సెమిస్టర్‌కు 913కు 852 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు.

జిల్లా ట్రెజరీలో భద్రంగా పోస్టల్ బ్యాలెట్లు

కర్నూలు(కలెక్టరేట్), మే 23: జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లు అన్ని జిల్లా ట్రెజరీలో భద్రంగా, సురక్షితంగా ఉన్నాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన గురువారం తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరిచిన జిల్లా ట్రెజరీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో పాటు డబుల్ లాక్ సిస్టం కూడా ఉందన్నారు. 24 గంటలు ఆర్మ్‌డ్ గార్డు పర్యవేక్షణ ఉంటుందని ఆమె వెల్లడించారు.

అన్న చేతిలో తమ్ముడి మృతి

కోడుమూరు (రూరల్), మే 23: మండలంలోని అనుగొండలో అన్న దాడి చేసిన ఘటనలో తమ్ముడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన భాస్కర్, వెంకటరాముడు అన్నదమ్ములు. వీళ్ల మధ్య కల్లం దొడ్డి స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. వెంకటరాముడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలను పోషిస్తున్నాడు. భార్య శోభ ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లడంతో బుధవారం రాత్రి వెంకటరాముడు కల్లందొడ్డిలో నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో అన్న భాస్కర్, తమ్ముడితో గొడవకు దిగి కర్రతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరాముడు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

చిన్నారిపై అత్యాచారయత్నం

హాలహర్వి, మే 23: అభం... శుభం... తెలియని చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మండలంలో ఈ ఘటన గురువారం జరిగింది. యాభై ఏళ్ల వయసు ఉన్న నిందితుడు చిన్నారికి మాయామాటలతో లోబరుచుకొనేందుకు ప్రయత్నించాడు. పాప అరవడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకుంటూ వచ్చేలోగా, ఆ వ్యక్తి పరారయ్యాడు. ఆ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నరేంద్రతెలిపారు.

చుక్కల దుప్పిపై కుక్కల దాడి

ఆత్మకూరు, మే 23: నల్లమల అటవీ సమీప గ్రామమైన ముష్టేపల్లిలోకి దారి తప్పి వచ్చిన ఓ చుక్కల దుప్పిపై కుక్కలు గురువారం దాడి చేశాయి. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్‌లోని ముష్టేపల్లి గ్రామంలోకి ఓ చుక్కల దుప్పి దారి తప్పి వచ్చింది. అక్కడున్న కుక్కలు దుప్పి మీద దాడిచేసి గాయపరిచాయి. కుక్కల బారి నుంచి తప్పించుకొని గ్రామంలోని ఓ ఇంటి బాత్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కుంది. గ్రామస్థులు కుక్కల నుంచి చుక్కల దుప్పిని రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు గాయపడిన చుక్కల దుప్పిని బైర్లూటిలోని వన్యప్రాణి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కోలుకున్న అనంతరం దుప్పిని తిరిగి అడవిలో వదిలేశారు.

నకిలీ ఎస్ఐ హల్‌చల్

- జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి
- అరెస్టు చేసిన పోలీసులు

నంద్యాల (నూనెపల్లె), మే 23: నంద్యాలలో నకిలీ ఎస్ఐ రామకృష్ణ గురువారం హల్‌చల్ చేశాడు. ఓ జిరాక్స్ సెంటరు వద్దకు వచ్చి తాను ఎస్ఐనని జిరాక్స్ కాపీ ఒక రూపాయకే ఇవ్వాలంటూ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. నంద్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బోయ రామకృష్ణ నకిలీ ఎస్ఐగా చలామణి అవుతున్నాడు. గురువారం నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ మాల్‌లో జిరాక్స్ సెంటరు వద్దకు వచ్చి తాను ఎస్ఐనని రూ ఒక్క రూపాయకే జిరాక్స్ కాపీ ఇవ్వాలని దౌర్జన్యం చేశాడు. ప్రశ్నించిన షాప్ నిర్వాహకుడు ఉదయ్‌ని నకిలీ ఎస్ఐ, అతని అసిస్టెంట్ గాయపరిచారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారులు దాడిని అడ్డుకొని, ఏ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్నారని అడిగారు. దానికి అతను పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వెంటనే వారు ఎస్పీకి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. ఘటనా స్థలానికి టూటౌన్ పోలీసులు చేరుకుని నకిలీ ఎస్ఐ బోయ రామకృష్ణని, అతని అసిస్టెంట్ బోయ హరేంద్రలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడి చేసిన వ్యక్తి బోయ రామకృష్ణ 2014 నుంచి 2016 వరకు ఏపీఎస్ ఆర్టీసీలో సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశాడని, విధులకు సరిగా హాజరు కాక పోవడంతో 2019లో ఉద్యోగం నుంచి రిమూవ్ చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. దాడి ఘటనపై బాధితుడు ఉదయ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



నకిలీ ఎస్ఐగా చలామణి అవుతున్న వ్యక్తి(టీషర్ట్ వేసుకున్న వ్యక్తి)

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

టీడీపీ గెలవాలని పూజలు



ఆంజనేయస్వామి గుడి వద్ద కొబ్బరికాయలు కొట్టిన నాయకులు

పాములపాడు, మే 23: టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అలాగే బైరెడ్డి శబరి ఎంపీగా గెలవాలని టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కురువ రమేశ్, సాయిక్రిష్ణ, సురేశ్, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివారులోని సంజీవ అభయాంజనేయ స్వామికి టీడీపీ యువసేనతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి: ఏడీఏ

నంద్యాల టౌన్, మే 23: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ పంటల సాగుకు క్షేత్రస్థాయిలో రైతులకు రిటైల్ సీడ్ దుకాణాల యజమానులందరూ అందుబాటులో ఉండి రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖ నంద్యాల ఏడీఏ డి.రాజశేఖర్ తెలిపారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో రిటైల్ సీడ్ దుకాణాల యజమానులతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ వర్షాలు ముందస్తుగా వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తున్న నేపథ్యంలో రైతులందరూ ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్నారని అన్నారు. రైతులకు తప్పనిసరిగా ప్యాకింగ్‌తో కూడిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. సీడ్ దుకాణాల యజమానులు ఇతర బ్రాండ్‌ల విత్తనాలను రైతులకు బలవంతంగా అంటగట్టే ప్రయత్నం చేయకూడదన్నారు. అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిరోజు స్టాక్ బోర్డును దుకాణాలలో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఏవో ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి: సీపీఐ



బానకచెర్లలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న నాయకులు

పాములపాడు, మే 23: నందికొట్కూర్ నియోజకవర్గంలో భూస్వాములు, పెత్తందారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఐ జిల్లా నాయకులు రమేశ్, రంగనాయుడు, బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. మండలంలోని బానకచెర్ల, వేంపెంట తదితర గ్రామాల్లో గురువారం పర్యటించారు. వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వేలాది ఎకరాలు పెత్తందారుల అనుభవంలో ఉన్నాయని, భూమిలేని పేదలకు 5 ఎకరాలు, ఇళ్లులేని పేదలకు 3సెంట్ల ప్రకారం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వ భూముల్లో ఎర్ర జెండాలు పాతి పేదలకు పంచి పెడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాముడు, ప్రతాప్, వెంకటశివుడు, యేసేపు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు చేపట్టాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

నంద్యాల (నూనెపల్లె), మే 23: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియను చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఈవీ గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలను ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో నిర్వహిస్తే విద్యార్థులకు సకాలంలో విద్యాబోధన జరగడమే కాకుండా ఉపాధ్యాయుల్లో కూడా బదిలీల గందర గోళం లేకుండా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో పలుకుబడి ఉండి రాజకీయ నాయకుల అండదండలు ఉన్న, ఉపాధ్యాయులు ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వులతో పైరవీ బదిలీలు చేపట్టుకునే విధానాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. పైరవీ బదిలీలతో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మౌలాలి, రామిరెడ్డి, నాగేంద్ర కుమార్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

మహానంది, మే 23: మండలంలోని అబ్బీపురం గ్రామానికి చెందిన సంపంగి రవిశేఖర్(45) అనే ఉపాధి హామీ పథకం కూలీ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. గ్రామ శివారు ప్రాంతంలో ఉపాధి హామీ పని కోసం వెళ్లి రవిశేఖర్ అక్కడ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుతో పాటు సహచర కూలీలు స్థానిక వైద్యశాలలో చికిత్సలు నిర్వహించారు. అక్కడ కోలుకోలేక రవిశేఖర్ మృతిచెందారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఉపాధిహామీ ఏపీవో మనోహర్ ఉపాధి కూలీ రవిశేఖర్ మృతదేహానికి నివాళి అర్పించారు.

'మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి'

కొత్తపల్లి, మే 23: కొత్తపల్లి మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి కోరారు. గురువారం తహసీల్దార్ తిరుపతయ్యకు మత్స్యకారులు జంబులయ్య, కాశీం, చిన్న మల్లయ్య, లింగేష్, కన్నయ్య, రంగన్న, బాలకృష్ణతో కలిసి వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, తిరుపాలుబాబు, రమణయ్య, శ్రీను, చిన్నలింగస్వామి, ఉసేనయ్య, వెంకటస్వామి, శ్రీరాములు, పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, మే 23: శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహా మంగళ హారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమై గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి వలయదారి మీదుగా గణేష సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, మహిషాసురమర్ధిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనం చేరుకొని తిరిగి నంది మండపానికి చేరుకుంది. క్షేత్రపరిధిలోని ప్రాచీన మఠాలను, ఆలయాలను భక్తులచే దర్శింపచేస్తూ భక్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తూ, క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా గిరి ప్రదక్షిన కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది.

లక్ష కుంకుమార్చన: శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనను జరిపించారు. భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవ ద్వారా అవకాశం కల్పించింది. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116 సేవా రుసుము చెల్లించి పరోక్షసేవలో పాల్గొనవచ్చును. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 28 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నట్లు దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు కోరారు.

ఊయల సేవ: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేశారు. ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆగని అక్రమ తవ్వకాలు

- ముంపు పొలాల నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు

పగిడ్యాల, మే 23: మండలంలోని నెహ్రూనగర్ గ్రామ సమీపంలోని శ్రీశైలం ముంపు పొలాల నుంచి దళారులు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ముంపు పొలాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, అధికారుల అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలువురు వ్యక్తులు అధికారుల ఆదేశాలను ధిక్కరించి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో పొలాలు ముంపునకు గురికావడంతో బాధితులకు అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం అందజేసింది. వర్షాలు కురిసినప్పుడు కృష్ణానదికి వరద నీరు చేరడంతో ఈ పొలాలు నీటిలో మునిగిపోతాయి. నదిలో నీరు తగినప్పుడు ఆ పొలాలకు చెందిన రైతులు పంటలను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే బాధిత రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న దళారులు ఈ మట్టిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రైతుల పొలాలకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. మట్టి అవసరమైన రైతులు దళారులను ఆశ్రయిస్తే ముంపు పొలాలకు చెందిన రైతుతో మాట్లాడి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇందుకోసం ట్రాక్టరు మట్టిని రైతు నుంచి రూ. 1000- 1500 కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో మట్టి అమ్మిన రైతుకు రూ. 100 చెల్లించగా, ట్రాక్టరు బాడుగకు రూ. 500 చెల్లించి మిగిన సొమ్మును దళారులు వెనుకేసుకుంటునట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు వంద ట్రాక్టర్లకు పైగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. ట్రాక్టరు డ్రైవర్లు పక్క పొలాలలో రస్తా ఏర్పాటు చేసుకొని మట్టిని తరలిస్తుండటంతో పొలాల హద్దులు దెబ్బతిన్నాయని వాపోతున్నారు. వీఆర్వో వెంకటస్వామిని కోరగా మట్టి అక్రమ తరలింపును నిలిపివేయలని చెప్పామని, అయినప్పటికీ దళారులు మట్టిని తరలిస్తున్నారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో మట్టిని ట్రాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం

ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు: ఎస్పీ



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల (నూనెపల్లె), మే 23: ఎలాంటి కఠిన పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. గురువారం ఎస్పి కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బందితో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్‌ను ఎస్పి పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగ నున్న నేపథ్యంలో పోలీస్ సిబ్బంది సంసిద్ధంగా ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణిచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చేలా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరిగినా హింసాత్మక చర్యలకు పాల్పడినా అల్లర్లు చేస్తున్న సమయాల్లో ఎలా స్పందించాలి? జన సమూహాలను నియంత్రించేందుకు ఎలాంటి హెచ్చరికలు జారి చేయాలి వినక పోతే సంబంధిత అధికారుల అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తమను తాము రక్షించుకుంటూ లాఠీఛార్జి, ఫైర్ డిపార్ట్ మెంట్ వాటర్ కెనాన్, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ తదితర వంటివి ప్రత్యేక పోలీసు బృందాలు డెమో ద్వారా ప్రదర్శించాయి. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్స్ పెక్టర్లు రవీంద్ర, వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు

నంద్యాల (నూనెపల్లె), మే 23: పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రాజారెడ్డి, తాలూకా సీఐ దస్తగిరిబాబు పోలీస్ అధికారులు సిబ్బందితో గురువారం కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అలాగే జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఐలతో పాటు కవాతులో ఎస్ఐలు నవీన్, ధనమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: స్థానిక ఇందిరానగర్‌లో సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డన్ సర్చ్‌లో గురువారం నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. ఇంటింటికి వెళ్లి సోదా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'టీకాపై అవగాహన ఉండాలి'

పాములపాడు, మే 23: క్షయవ్యాధి రాకుండా ఉండేందుకు అడల్ట్ బీసీజీ టీకా కాపాడుతుందని, ఈ టీకాపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని టీబీ సూపర్‌వైజర్ రవి సూచించారు. భానుముక్కల గ్రామంలో ఉప ఆరోగ్య కేంద్రంలో గురువారం టీబీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సృజన, హెల్త్ అసిస్టెంట్ కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: క్షయ వ్యాధి నివారణకు ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా, సూపర్‌వైజర్ రమణమ్మ, మధు కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు'

కొత్తపల్లి, మే 23: సార్వత్రిక ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ నాయకులైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే.. కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులను స్టేషన్‌కు పిలిపించి జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ రోజున ఎన్నికల కోడ్ నియమావళిపై వారు వివరించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడ కూడా నలుగురు మించి గుమి కూడదరాదన్నారు. అలాగే 30 యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే.. కౌంటింగ్ అనతరం టపాసులు కాల్చడం నిషేదం అన్నారు. ఏ చిన్న సమస్య జరిగినా నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని సీఐ నాగభూషణ్, ఎస్ఐలు హెచ్చరించారు.

స్ఫటిక లింగేశ్వరాలయంలో వరుణ హోమం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), మే 23: నంద్యాలపట్టణంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో వెలసిన అమ్మ స్ఫటికలింగేశ్వరాలయంలో వైశాఖ బుద్ధ పౌర్ణమి పురష్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మస్ఫటిక లింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం రుష్యశృంగ మహాముని వరుణ మంత్రంతో వరుణ యజ్ఞాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో యోగానంద, యోగాసభ్యులు పాల్గొన్నారు.

సుదర్శన హోమం: నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ 26వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు మధు, అర్చకులు, శ్రీరామమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి కల్యాణం

నంద్యాల (కల్చరల్), మే 23: నంద్యాల కోట వీధిలో వెలిసిన రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా గురువారం రమాసమేత సత్యనారాయణ స్వామి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవికి ప్రత్యేక అలంకారం, రమాసమేత సత్యనారాయణస్వామికి చందనంతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం రమాసమేత సత్యనారాయణస్వామి వారి ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. కళ్యాణం అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాడికి శ్రీదేవి, భక్తులు, ఆలయసిబ్బంది బాలుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐని సస్పెండ్ చేయాలి

- అనుచిత వ్యాఖ్యలు చేశారని మహిళ ఆరోపణ



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రజియా బీ

నందికొట్కూరు, మే 23: అనుచితంగా మాట్లాడిన నందికొట్కూరు పట్టణ సీఐ ప్రకాశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని రజియా బీ గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆమె మాట్లాడుతూ 14 రోజుల క్రితం తన కాలనీకి చెందిన మురళి అనే వ్యక్తి తన ఇంటి ముందు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం విచారణ కోసం పిలిపించిన సీఐ అనుచితంగా మాట్లాడారని రజియా బీ ఆరోపించారు. దీంతో గురువారం ఆమె పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. ఏపీ రైతు సంఘంలో పని చేస్తున్న తనపట్లనే సీఐ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే, సామాన్యులపై మరెలా ప్రవర్తిస్తున్నారో అర్థమవుతోందని అన్నారు. అసభ్యంగా ప్రవర్తించిన మురళిపై కేసు నమోదు చేయాలని, అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఐపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

సీఐ తీరుపై మహిళల ఆగ్రహం

గురువారం పట్టణంలోని ఏబీఎం పాలెంలో నగ్నంగా తిరుగుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తిని దేహశుద్ధి చేసిన మహిళలను స్టేషన్‌కు పిలిపించి సీఐ ప్రకాశ్ కుమార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంలో జరిగిన విషయాన్ని చెప్పిన తమపై సీఐ అనుచితంగా మాట్లాడారని మహిళలు ఆరోపించారు. మహిళలతో ఇలాగేనా మాట్లాడేది? అంటూ మహిళలు మండిపడ్డారు.

'ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి'

నంద్యాల టౌన్, మే 23: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13వ తేదీ జరిగిన పోలింగ్ విధుల్లో పని చేసిన మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణయ్య కార్యదర్శి భాస్కరాచారి డిమాండ్ చేశారు. గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో మున్సిపల్ అవుట్ సోర్సింగ్, వాటర్ వర్క్స్ విభాగాలకు చెందిన 120 మందికిపైగా కార్మికులు ఎన్నికల అధికారులకు, ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు మంచినీటి సరఫరా చేసి విధుల్లో పాల్గొన్నారని చెప్పారు. పోలింగ్‌కు ముందు బస్సుల్లో వచ్చిన బాక్స్‌లను దించి, వచ్చిన బాక్స్‌లను ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు చేర్చడం, పోలింగ్ పూర్తయ్యాక వాటిని బస్సులకు ఎక్కించి అర్ధరాత్రి వరకు మున్సిపల్ కార్మికులతో పనులు చేయించుకున్నారని చెప్పారు. అయితే ఈ సేవలకు ఇతర అధికారులకు చెల్లించిన విధంగా ప్రత్యేక అలవెన్స్‌లను మున్సిపల్ కార్మికులకు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై స్పందించి ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహించిన మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలని జేసీని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మహానందిలో హోమాలు



మహానందిలో యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మే 23: మహానంది క్షేత్రంలో వైశాఖ శుద్ధ పౌర్ణమి పురష్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని యాగశాల మంటపంలో వేదపండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గురువారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా వేదపండితులు రవిశంకర్ అవధాని మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి, ఆశ్వయుజ పౌర్ణమి, మాఘపౌర్ణమి, వైశాఖ పౌర్ణమిల్లో ప్రత్యేక ప్రత్యేక ఆరాధన చేస్తే సంపూర్ణ విశేష యజ్ఞఫలాన్ని పొందవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ పూజలు

మహానంది క్షేత్రంలో గురువారం తిరుపతి జోన్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ (ఐఆర్ఎస్) దుర్గేష్ సమరోట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వర స్వామికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. పూజల అనంతరం వీరిని కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించి, శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందచేశారు. ఈవో స్వామి వారి మెమెంటోను అందచేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు, అర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మ పాల్గొన్నారు.

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి, మే 23: మండలంలోని నందికుంట గ్రామ శివారులో వెలసిన విశ్వమాత ఆలయ ప్రాంగణంలో అశేష భక్తజనం మధ్య పార్వతి పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం విశ్వమాత ఆలయం పంచమ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకులు బానాల లక్ష్మీనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య జరిగిన స్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుకలకు భక్తులు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం 6 గంటలకు నందికుంట గ్రామ పురవీధుల గుండా రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నందికోల, చెక్కభజనలతో ఊరేగించారు.

క్యూలైన్ల విస్తరణకు చర్యలు: ఈవో



పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 23: శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు సర్వదర్శనం క్యూలైన్ల విస్తర పనులు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సర్వదర్శనం క్యూలైన్లకు ఇరువైపుల ఖాళీగా ఉన్న క్యాంటీన్, రథశాల పక్కన స్థలంలో నూతన క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వారాంతరాల్లో క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని అ సమయంలో భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించే విధంగా క్యూలైన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, అల్పాహారం మొదలైనవాటిని నిరంతరం అందజేసేలా చూడాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

శ్రీశైలం క్షేత్రానికి వాహనాల ద్వారా సందర్శించే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్షేత్రపరిధిలోని రద్దీ ప్రదేశాలలో ట్రాఫిక్ నియంత్రనకు చర్యలు చేపట్టాలని ఆలయ ఇంజనీరింగ్, దేవస్థానం భద్రతా అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం దేవస్థానం వైద్యశాల కూడలి, విద్యుత్ శాఖ ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయం కూడలి, యాదవసత్రం, జగద్గురు సత్రం తదితర వాహనాల రద్దీ ప్రదేశాలను ఈవో పరిశీలించారు. అవసరమైన కూడళ్లలో బారికేడ్‌లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా రూట్ డైవర్షన్స్ ద్వారా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే అవసరమైన చోట్ల రహదారుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి. రామకృష్ణ, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, భద్రతా విభాగం పర్యవేక్షకులు కె.అయ్యన్న, విరాళాల సేకరణ, దర్శనం క్యూలైన్ల పర్యవేక్షకురాలు హిమబిందు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు

నంద్యాల (కల్చరల్), మే 23: నంద్యాల కుందూసాహితీ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ పార్కులో గల బుద్ధవిగ్రహం వద్ద భక్తులు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు బుద్ధ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నెం శ్రీనివాసరెడ్డి, పలు సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రోఖియాబీ దర్గా గంధం

వెలుగోడు, మే 23: వెలుగోడులో వెలసిన రోఖియాబి దర్గా గంధం వేడుకలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుఝాము వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంధంను ఉంచిన ప్రత్యేక వాహనాన్ని మేళతాళాలతో భారి డప్పుల నడుమ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవు: సీఐ



కలుగోట్లలో ఇళ్లు సోదా చేస్తున్న సీఐ, పోలీసులు

కోవెలకుంట్ల, మే 23: గ్రామాల్లో గొడవలకు పాల్పడితే చర్యలు తప్ప వని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. గురువారం కోవెల కుంట్ల సర్కిల్ పరిధిలోని కలుగోట్ల గ్రామంలో సీఐ జయ చంద్ర ఎస్సైలు రాంమోహన్ రెడ్డి, వరప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ జయచంద్ర మాట్లాడుతూ కౌం టింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా గ్రామాలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఇం దులో భాగంగా కలుగోట్లలో అనుమానం ఉన్న వారి ఇళ్లను తనిఖీ నిర్వ హించగా సరైన పత్రాలులేని 11 మోటర్ సైకిల్‌ను గుర్తించి సీజ్ చేశా మన్నారు. కౌంటింగ్ రోజున ఫలితాలు వెలువడిన తర్వాత ర్యాలీలు చేయడం, టపా సులు పేల్చడం వంటివి నిషేధించామన్నారు.

రామకృష్ణాపురంలో కార్డన్ సెర్చ్



గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

బనగానపల్లె, మే 23: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో కార్డన్ సెర్చ్ బనగానపల్లె సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఫ్యాక్షన్ గ్రామమైన రామకృష్ణాపురం గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడ్డా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సం దర్భంగా గ్రామంలో నంబర్లు లేని 11 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. అనంతరం గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు. నందివర్గం ఎస్ఐ తిరు పాలు, బనగానపల్లె ఎస్ఐ రామిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: డీపీవో



మాట్లాడుతున్న డీపీవో మంజులవాణి

రుద్రవరం, మే 23: జిల్లాలో తాగునీటి సమస్య, వాటర్ ట్యాంకుల శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని డీపీవో మంజులవాణి సూచిం చారు. గురువారం రుద్రవరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 480 పంచాయతీలు ఉన్నాయన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ, ఈవోపీఆర్‌డీ, ఎంపీడీవో వారానికి ఒకసారి ప్రతి గ్రామా న్ని పర్యవేక్షించి అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. తప్పు చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో కార్యదర్శులు ఆదర్శ వంతంగా పనిచేసి ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పదిహేనురోజుల కొసారి వాటర్ ట్యాంకులు కార్యదర్శులు దగ్గరుండి క్లోరినేషన్ చేయించి గ్రూపులో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంకుడు గుంతలు టో ఫీడ్స్ పరిశీలించాలన్నారు. కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా అన్నిరికార్డులను సక్ర మంగా ఉంచాలన్నారు. ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏఈ ప్రమోద్, ఇన్‌చార్జి ఎంఈఓ కోటయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు నాగప్ర సాద్, రాదయ్య, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

29న ఆలయ భూముల కౌలు వేలం

శిరివెళ్ల, మే 23: మండలంలోని బోయలకుంట్ల గ్రామంలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు ఈ నెల 29వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తు న్నట్లు కోటపాడు గ్రూపు దేవాలయాల ఈవో గంటా వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. ఇందులో రామేశ్వర, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 25.26 ఎకరాలకు, అనంత పద్మనాభ స్వామి దేవస్థానానికి చెందిన 11.62 ఎకరాలకు, ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 11.44 ఎకరాలకు, వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 11.89 ఎకరాలకు, నరసింహ స్వామి దేవాలయానికి చెందిన 5.94 ఎకరాలకు కౌలు వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. అదేరోజు సాయంత్రం కామినేనిపల్లె గ్రా మంలో వెలసిన ఈశ్వర స్వామికి చెందిన 18.09 ఎకరాలకు, ఆంజనేయ స్వామికి చెందిన 12.97 ఎకరాలకు మూడు సంవత్సరాల కాలపరిమితితో కౌలువేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

1న కోటపాడులో..: మండలంలోని కోటపాడు గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 38.27 ఎకరాలకు, కేశవ స్వామి ఆ లయానికి చెందిన 45.58 ఎకరాల భూములకు జూన్ 1న బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. రైతులు రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

28న సాధుకొట్టంలో..

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి క్షేత్రం భూముల కౌలు వేలం ఈనెల 28న నిర్వ హిస్తున్నట్లు ఈవో చంద్ర శేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిలు గురువారం తెలి పారు. ఈ ఏడాది నుంచి 2027 వరకు మునుగుత్త కౌలుకు సాధుకొట్టం గ్రామంలోని శ్రీరాముల దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. వివ రాల కోసం యాగంటి ఆలయంలోని ఈవో కార్యాలయాన్ని సంప్రదిం చాలని వారు సూచించారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

డోన్(రూరల్), మే 23: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటలకు వినాయక సుబ్రహ్మణ్య స్వామివార్లకు, నవగ్రహాలకు, నాగమయ్యలకు పంచామృతాభిషేకాలు, అయ్యప్ప స్వామి వారికి అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, ఒంటి గంటలకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మణికంఠ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

చాగలమర్రి, మే 23: చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయం, పట్టాభిరామ ఆలయాల్లో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవాన్ని నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. సీతారాముల పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'ఫీజు లేకుండానే పది సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం'

కొలిమిగుండ్ల రూరల్, మే 23: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు, అలాగే పరీక్షలకు ఫీజు చెల్లించి గైర్హాజరైన విద్యార్థులు మళ్లీ ఫీజు చెల్లించకుండానే శుక్రవారం నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలు రా యొచ్చని కొలిమిగుండ్ల మండల విద్యాధికారులు అబ్దుల్‌కలాం, రాజయ్య గురువారం వెల్లడించారు. హాల్ టికెట్లు ఇంటర్‌నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఆ కేంద్రాలు నిరుపయోగం

చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు కష్టాలు

కొలిమిగుండ్ల రూరల్, మే 23: స్వచ్ఛ భారత్ నిర్మాణంలో భాగంగా గ్రామాల పరిశుభ్రతే ప్రధాన ధ్యేయంగా గత ప్రభుత్వం నిర్మిం చిన చెత్త సంపద కేంద్రాలకు చెదలు పడుతోంది. చెత్త పన్ను విధిం చడంలో ఆసక్తిని కనబరచిన వైసీపీ ప్రభుత్వం, అదే చెత్తను సేకరించి, సంపద సృష్టించడంలో మాత్రం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలస త్వం కారణంగా గ్రామాల్లో ప్రజలకు చెత్త కష్టాలు తప్పడం లేదు.



చెత్తతో పేరుకుపోతున్న ఎర్రవాగు



నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డు

కొలిమిగుండ్ల మండల కేంద్రంలో గ్రామానికి దూరంగా డంపింగ్ యార్డు కేంద్రాన్ని నిర్మించడం, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వల్ల చెత్త సేకరణ జరడంలేదు. దీంతో పట్టణ ప్రజలు తమ ఇళ్లలో లభించే చెత్త కాలు వల్లోనూ, ప్రధాన రహదారుల పక్కన పడే స్తున్నారేగాని చెత్త సంపద కేంద్రాలకు చేరడం లేదు. దీంతో కొలిమిగుండ్లతో పాటు మం డలంలోని మీర్జాపురం, ఇటిక్యాల, అంకిరెడ్డిపల్లె, బెలుం తదితర సుమారు 25 గ్రామాల్లో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

'క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకా'

చాగలమర్రి, మే 23: క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకా వేస్తున్నట్లు జిల్లా బీసీజీ వ్యాక్సినేషన్ నోడల్ అధికారి రామనాథరావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. చాగలమర్రి ఎస్సీ కాలనీలో వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్‌ను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ బీసీజీ టీకాల కార్యక్రమం ఆగస్టు చివరి వరకు జరుగు తుందని చెప్పారు. 6 కేటగిరీలుగా విభజించారని చెప్పారు. 60 సంవత్స రాలు పైబడిన వృద్ధులు, 2018-21 వరకు టీబీ, షుగర్ తదితర వ్యాధు లతో బాధపడేవారికి టీకా వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 500 సచివాలయాల్లో బీసీజీ టీకా వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 5 లక్షల మందికి బీసీజీ టీకా వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రతి గురు వారం ఈ టీకా వేయనున్నట్లు తెలిపారు. బీసీజీ టీకా వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలో మందుల కొరత లేదని, విష పురుగుల కాటుకు గురైతే ప్రభుత్వ వైద్య శాలలో సూది మందు అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ప్రసన్నలక్ష్మీ, మలేరియా నివారణ అధికారి వరప్రసాదురెడ్డి, వైద్యులు ఇమ్రాన్, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ: చాగలమర్రిలోని 24 గంటల ప్రభుత్వ వైద్యశాలను జిల్లా డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం జిల్లా బీసీజీ వ్యాక్సినేషన్ నోడల్ అధికారి రామనాథ రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ప్రసన్న లక్ష్మి, ఏఎంవో ప్రసాదు రెడ్డి తనిఖీ చేశారు. వైద్యశాలలో సంబంధిత రికార్డులను, వోపీని పరిశీ



బీసీజీ టీకాను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

లించారు. వైద్య చికిత్సల కోసం వచ్చిన రోగుల సమస్యలను అడిగి తెలు సుకున్నారు. వివిధ పరీక్షలకు సంబంధించిన రికార్డులను, మందుల స్టాక్‌ను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.

బేతంచెర్ల: వయోజనులు బీసీజీ టీకాలు వేయించుకోవడం వల్ల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని టీబీ జిల్లా నివారణ సూపర్‌వైజర్ రామక్రిష్ణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని హెల్త్ సబ్ సెంటర్‌లో జరుగుతున్న వయోజనులకు బీసీజీ టీకా కార్యక్రమాన్ని జిల్లా టీబీ నివారణ సూపర్‌వైజర్ రామక్రిష్ణ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఇమ్రాన్ ఖాన్, ఏఎన్ఎంలు లక్ష్మీదుర్గ, రామాంజనేయులు, తిప్ప మ్మ, రేణుక, లక్ష్మీదేవి, అమల, ఆశాలు రమాదేవి, నాగేంద్రమ్మ, లక్ష్మీదేవి, నాగమణి, లావణ్య పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు పూజలు



బేతంచెర్లలో షిరిడీ సాయిబాబకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల, మే 23: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణ శివారులోని కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబాకు గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, సుచరిత పారాయ ణం, ఆలయ సంకీర్తన, సాయిబాబాకు కాగడహారతి చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షిరిడీ సాయి బాబా కృపాదమ్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో బుద్ధ పౌర్ణిమను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వీడీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు రాంప్రసాద్ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల, ఇటిక్యాల, బెలుం, కల్వటాల గ్రామాలకు చెందిన పలువురు భక్తులు సాయిబాబాను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో విగ్రహానికి అభిషే కం చేసి పూజలు నిర్వహించారు. రుద్రవరం గ్రామంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జల, పాలాభిషేకాలు, ప్రత్యేక హారతులతో మహిళలు సామూహిక పూజలు చేశారు. అనంతరం సాయి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బేతంచెర్ల, మే 23: వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని ఎంబాయి గ్రామంలో గురువారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యా ణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయాల ఈవో మద్దిలేటి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు పవన య్యశర్మ, వేణుగోపాల శర్మ, సర్పంచ్ యుగంధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి కల్యాణం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణం గురువారం నిర్వహించారు. కార్య క్ర మంలో ఉప కమిషనర్ ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారా మచంద్రుడు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టండి



ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

డోన్(రూరల్), మే 23: డోన్ సబ్ డివిజన్ ప్రాంతంలో నకిలీ విత్తనాలు అరికట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డె మహారాజ్, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్దన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల రైతులు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, కోడి అశోక్, నాగార్జున, పోలా వెంకటేశ్వర్లు, ఔక్ వెంకటేశ్, పవన్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

నాగుల విగ్రహాలు ధ్వంసం



కాశీచింతల క్షేత్రంలో దుండగులు ధ్వంసం చేసిన విగ్రహాలు

నంద్యాల, మే 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని కాశీచింతల క్షేత్రంలోని సుబ్రమణ్యంస్వామి, నాగుల విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. గురువారం వేకువజామున పూజలు చేసేందుకు వెళ్లిన శివశంకరశర్మ గమనించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి గరుడోత్సవం

చాగలమర్రి, మే 23: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర బ్రహ్మోత్స వాల సందర్భంగా గరుడోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇత్తడితో తయారు చేసిన గరుడ వాహనంపై చెన్నకేశవ సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వీధుల గుండా గ్రామోత్సవం చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

చాగలమర్రి, మే 23: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కళాశాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో అనూరాధ, హెచ్‌ఎం కోటయ్య తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 10 రోజుల క్రితం ఇంటర్మీడియటల్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఏవైన రెండు గ్రూపుల్లో విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతులు మంజూరయ్యా యని సూచించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఎంపీసీ, సీఈసీ గ్రూపులపై ఆసక్తి చూపుతున్నారని, ఈ ఏడాది రెండు గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 మందికి ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పాఠశాలలో ఇంటర్యాక్టివ్ ప్లాంట్ ప్యానల్‌లు 24 ఉండగా, కళాశాలలో విద్యాబోధనకు మరో 5 ప్యానల్‌లను మంజూరు చేశారని తెలిపారు. జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులను ప్రారంభిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూముల కౌలు విషయంలో బెదిరింపులు..?

రుద్రవరం, మే 23: మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామంలో భూములు కౌలు విషయంలో ఓ రైతును కొందరు అధికార పార్టీ నేతలు బెదిరించినట్లు సమాచారం. తమకు తెలియకుండా నీ భూమి ఎలా కౌలుకు ఇస్తావు అని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. తన భూమి, మా భూమి నాకు కౌలుకు ఇచ్చే రైతులకు కౌలుకు ఇస్తానని సదరు రైతు అన్నారు. నీవు గ్రామంలోకి ఎలా వస్తావు అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. భూముల కౌలు విషయంలో కూడా ఆగ్రామ అధినాయకులకు చెప్పి ఇవ్వాల్నా..? రైతుల భూములు కౌలుకు ఇతర రైతులకు ఇవ్వడంలో కూడా స్వేచ్ఛ లేదా అన్న చర్చ ఆ గ్రామంలో కొనసాగుతోంది.

పెరిగిన మహిళా ఓటింగ్‌తో లాభమెవరికో?

- ప్రభుత్వ వ్యతిరేక ఓటు అంటున్న టీడీపీ
- సానుకూల ఓటే అంటున్న వైసీపీ
- కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ నేతల్లో పెరుగుతున్న టెన్షన్
- పందెంరాయుళ్లలో మరింత ఉత్కంఠత

కొలిమిగుండ్ల రూరల్, మే 23: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. కౌంటింగ్ సమయం దగ్గర పడేకొద్దీ నేతల్లో మరింత టెన్షన్ పెరుగుతోంది. నేతల మెజార్టీ, గెలుపోటములపై కోట్లాది రూపాయలు బెట్టింగ్ పెట్టిన పందెం రాయుళ్లలో నరాలు తెగే ఉత్కంఠత ఏర్ప డింది. ఓటింగ్ శాతం పెరగడంపైనే ఇప్పుడు చర్చలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో 81.86 శాతం రికార్డు స్థాయి పోలింగ్ జరగడం, అందరిలోనూ మహిళా ఓటింగ్ పెద్ద ఎత్తున పెరగడం ఎవరికి లాభం ..? ఎవరికి నష్టం ..? అన్న అంశంపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. బనగానపల్లె నియో జకవర్గంలో 2750 మంది మహిళలు పురుషుల కంటే అదనంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నువ్వా ..? నేనా ..? అన్న తీవ్రమైన పోటీలో ఈ ఓటింగ్ సంఖ్య నేతల తలరాతను మారుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీంతో పెరిగిన మహిళా ఓటింగ్ పైనే ప్రధానంగా నాయ కులు, కార్యకర్తల్లో చర్చ నడుస్తోంది. కాగా ప్రభుత్వ వ్యతిరేకతతోనే ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారని, ఓటింగ్ సరళి తమకే అనుకూలంగా వుందంటూ ప్రతిపక్ష టీడీపీ కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే మహిళలు ప్రభుత్వానికే అనుకూలంగా వున్నారని, పెరిగిన మహిళా ఓటింగ్ తమకే మేలు చేస్తుందని అధికార వైసీపీ బీరాలు పలుకుతోంది. దీంతో గెలుపు ఎవరిని వరిస్తుందో అర్థంకాక నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు పంపిణీనే ఓటింగ్ పెరగడానికి ప్రధా న కారణమన్న విశ్లేషణలు సైతం వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హైదరా బాదుతో పాటు ఇతర ప్రాంతాల్లో వున్న ఏపీ ఓటర్లకు పోటీలో వున్న అభ్య ర్థులు ఓటుకు నోటుతో పాటు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు అదనంగా ఆన్‌లైన్‌లో చెల్లించడంతో రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతం పెరిగిందనే వాదనలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఉదాహరణకు బనగానపల్లె నియోజకవర్గంలో 2,03,839 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా సుమారు 8వేల మంది ఇతర ప్రాంతాల్లో వున్న విద్యార్థులు, ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి తరలివచ్చినట్లు అయా పార్టీల లెక్క ద్వారా తెలుస్తోంది. కాగా ఓటింగ్ శాతం పెరిగినప్పుడు సహజంగా తీర్పు ప్రతి పక్షానికే అనుకూలంగా వుంటుందని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొం టున్నారు.

'పనులు వేగవంతం చేయండి'

రుద్రవరం, మే 23: పాఠశాలల్లో నాడు నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని ఏఈ హరీష్ అన్నారు. మండలంలో 42 పాఠశాలల్లో నాడు నేడు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ పనులకు గాను రూ.4.65 కోట్లు మంజూరు కాగా, రూ.3.76 కోట్లు ఖర్చు చేశామన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయని పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

రుద్రవరం రేంజ్‌లో రెండు ఏపీసీ క్యాంపుల ఏర్పాటు

రుద్రవరం, మే 23: రుద్రవరం రేంజ్‌లో రెండు యాంటి ప్రోచెర్స్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు రేంజర్ శ్రీపతినాయుడు తెలి పారు. నూతన సెక్షన్‌లో ఒకటి, రుద్రవరం సెక్షన్‌లో మరోకటి ఏర్పాటు చేశామన్నారు. నల్లమల అటవీలో భాగంగా రుద్రవరం రేంజ్‌లో ఎలాంటి వన్యప్రాణులకు హానీ తలపెటకుండా ఎప్పటికప్పుడు వీటిలో పనిచేసే ప్రొటెక్షన్ వాచర్లు నిఘా వేసి సమాచారం అందిస్తారన్నారు.

నిందితుల అరెస్టు

కొలిమిగుండ్ల రూరల్, మే 23: మండలంలోని పేట్నికోట గ్రామానికి చెందిన 21 మంది నిందితులను గురువారం అరెస్ట్ చేసి నట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథరెడ్డి తెలిపారు. మే-13న పోలింగ్ రోజు జరిగిన గొడవకు సంబంధించి ఇప్పటికే ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని అన్నారు. ఇందులో 21 మందిని గురువారం అరెస్ట్ చేసి కోవెలకుంట్ల న్యాయాధికారి ముందు హాజ రుపరచగా వారికి 14రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. అనంతరం నింది తులను ఆళ్లగడ్డ సబ్‌జైలుకు తరలించామన్నారు.

గరుడ వాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల, మే 23: కోవెలకుంట్ల పట్టణంలో పాండురంగ విఠలేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు గరుడవాహన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ఆలయం నుంచి ఊరేగించారు. రాత్రి గరుడవాహనంపై ఊరేగింపు గా వచ్చిన స్వామిని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి దంపతులు, గడ్డం అమరనాథరెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బుద్ధ పౌర్ణమి

శిరివెళ్ల, మే 23: మండలంలోని గ్రామాల్లో బుద్ధ పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. యర్రగుంట్లలోని సద్గురు రామకృష్ణానంద గీతాశ్రమంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. విష్ణు సహస్ర నామం, గీతా పారాయణం చేశారు. శిరివెళ్ల మెట్ట, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో గౌతమ్ రెడ్డి

డోన్(రూరల్), మే 23: యాపదిన్నె గ్రామంలో జరిగే లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు డోన్ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఆయన వెంట యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

సంజామల, మే 23: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ షేక్ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ షేక్ షర్ఫుద్దీన్, కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, సంజామల ఎస్ఐ రమేష్ రెడ్డి, కోవెల కుంట్ల సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో కలసి మండ లంలోని ఆల్వకొండ గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామ ప్రజలను సమావేశపరిచి డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడుతూ అనవసరంగా గ్రామాల్లో రెచ్చగొట్టే చర్యలకు ఎవరు పాల్పడ్డా, అల్లర్లు ప్రేరేపించినా చర్యలు తీసుకుంటామన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

సంజామల, మే 23: రైతులు పాడిపశువులకు టీకాలు వేయించాలని పశువర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మోహన్‌రావు కోరారు. గురువారం మండలంలోని పేరుసోముల గ్రామంలో పశువులకు జబ్బులు రాకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించారు. డాక్టర్ శివానంద, సిబ్బంది ఉన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

చాగలమర్రి, మే 23: గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ నింపాలన్నారు. ప్లాస్టిక్ క్యాన్‌లు, బాటిళ్లలో నింపాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ విషయంపై పెట్రోల్ యజమానులకు నోటీసులు కూడా అందజేశామని తెలిపారు.

27న రాష్ట్ర స్థాయి బండలాగు పోటీలు

కోవెలకుంట్ల, మే 23: కోవెలకుంట్ల పట్టణంలో పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 27న రాష్ట్ర స్థాయి బండలాగు పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహు మతి రూ.10వేలు అందిస్తా మన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 27లోగా తమ పేర్లను నమోదు చేయిం చుకోవాలని సూచించారు.

నీటి కోసం కో(తి)టి కష్టాలు

చాగలమర్రి, మే 23: ఎండ తీవ్రత వల్ల మూగ జీవాలు నీటి కోసం ఇబ్బందులు పడుతు న్నాయి. నీరు లేక పోవడంతో మురుగు నీటిని కూడా తాగి దాహం తీర్చుకుంటున్నాయి. గురువారం చాగలమర్రి గ్రామం లోని కూలూరు రహదారిలో కొళాయికి వస్తున్న నీటిని తాగేందుకు ఇబ్బంది పడింది. కొళాయి నుంచి వస్తున్న నీటిని తాగి దాహం తీర్చుకొని వెళ్లింది.



కొళాయి నీటిని తాగుతున్న వానరం